పోరాటాలకు సిద్ధం కావాలి

సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

షాబాద్, జూన్ 1: భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో రాబోయే కాలంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం షాబాద్‌లోని ముదిరాజ్ భవన్‌లో సీపీఐ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఆరు నెలలుగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో నిమగ్నమైన పార్టీ నాయకులు, కార్యకర్తలు.. ఇకపై ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని తెలిపారు. రాబోయే గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సీపీఐ ఆధ్వర్యంలో ఎన్నికల బరిలో నిలువాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి నారాయణ, నాయకులు రుక్కయ్య, రాములు, శ్రీశైలం, మధు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 74 కేసులు పరిష్కారం

చేవెళ్లటౌన్, జూన్ 1 : వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపరాదని, మరోసారి ఇలాంటి కేసులు కాకుండా చూసుకోవాలని రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు తెలిపారు. శనివారం చేవెళ్లలోని జూనియర్ సివిల్ కోర్టు అవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో 74 కేసులు పరిష్కరించగా.. రూ.1,77,000 ఫైన్ వేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఎస్సై విఠల్‌రెడ్డి, కోర్టు పోలీసులు, సిబ్బంది కవిత పాల్గొన్నారు.

మున్సిపల్ డీఈగా శివానందం

పెద్దఅంబర్‌పేట, జూన్ 1 : మున్సిపాలిటీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎస్.శివానందం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రధాన కార్యాలయం నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ దాదాపు నాలుగున్నరేండ్లపాటు డీఈగా పనిచేసిన అశోక్‌కుమార్ శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో శివానందం బాధ్యతలు తీసుకున్నారు.

హుండీ చోరీ

మొయినాబాద్, జూన్ 1 : ఆలయంలోని హుండీని పగులగొట్టి డబ్బులు దొంగిలించిన ఘటన మండల పరిధిలోని సురంగల్ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. సురంగల్‌లోని పెద్ద చెరువు కట్టపై గత ఏడాది క్రితం కట్టమైసమ్మ ఆలయ పునఃనిర్మాణం చేపట్టారు. దీనిలో భాగంగా ఆలయంలో హుండీ ఏర్పాటు చేశారు. గత ఏడాది నుంచి హుండీని మాత్రం తెరవలేదు. ఆలయ భద్రత కోసం సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు. కానీ సీసీ కెమెరాలు పని చేయడంలేదు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయ గర్భగుడి ఎదుట ఉన్న హుండీని ఆలయ గర్భగుడి కింది అంతస్తుకు తీసుకెళ్లి పగులగొట్టే ప్రయత్నం చేశారు. కాని హుండీ పగులక పోవడంతో కానుకలు వేసే రంధ్రాన్ని పెద్దగా చేసి అందులో ఉన్న డబ్బులను తీసుకెళ్లారు. గ్రామస్తులు ఉదయం ఆలయం వద్దకు వెళ్లగా ఆలయంలో హుండీ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం చేసిన తీరును పరిశీలించారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం అందజేస్తున్న వైస్ ఎంపీపీ ఆనంద్

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కడ్తాల్, జూన్ 1 : సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని గాన్గుమార్లతండా గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి, వైస్ ఎంపీపీ అందించిన రూ.50 వేల విరాళాన్ని జడ్పీటీసీ ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. మండలంలో ఆలయాల నిర్మాణాలకు సహకరమందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, నంద్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు పాండు, నాయకులు శ్రీను, భీమన్, లక్ష్మణ్, మహేశ్‌గౌడ్, అంజి, గణేశ్, జగన్, సక్రూ, కోట్యా, హరి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

కడ్తాల్, జూన్ 1 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని.. క్రీడల్లో గెలుపోటములు సహజమని టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో వారంలో రోజులుగా నిర్వహిస్తున్న ఎంపీఎల్ (జూనియర్) క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. టోర్నీ విజేత మల్లేశ్ టీంకు సభావట్ వినోద్‌కుమార్ రూ.20 వేలు, రన్నరప్ మాలిక్ టీంకు శ్రీనివాస్‌గౌడ్ రూ.10 వేలు అందజేశారు.

పోలీస్ కోఆర్డినేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి స్వరూప

8న జాతీయ లోక్ అదాలత్

జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప

ఆమనగల్లు, జూన్ 1 : ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు లోక్ అదాలత్‌తో పరిష్కారమవుతాయని శనివారం జాతీయ లోక్ అదాలత్ చైర్మన్, ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లులోని కోర్టు ప్రాంగణంలో ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉన్నందున పోలీస్ కో ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేశారు. రాజీయే రాజమార్గంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో ఏపీపీ కార్తిక్, ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల్ సీఐలు ప్రమోద్ కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, శివప్రసాద్, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్, ఎస్ఐలు బలరాంనాయక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమంగా పేలుడు పదార్థాల నిల్వలు

- 490 జిలెటిన్ స్టిక్స్‌లను గుర్తించిన పోలీసులు
- వివరాలను వెల్లడించిన ఏసీపీ రంగస్వామి

కేసు వివరాలను తెలుపుతున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్, జూన్ 1 : షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ చేసిన పేలుడు పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి శనివారం తెలిపారు. షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పేలుడు పదార్థాల తరలింపు, వినియోగం వంటి వివరాలను వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా బిల్డింగ్ బ్లాక్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ యజమాని మధుసూదన్‌రెడ్డి నల్గొండ జిల్లాకు చెందిన సతీష్ నుంచి పేలుడు పదార్థాలను తీసుకొచ్చి షాద్‌నగర్ ప్రాంతంలో నిల్వచేశారని చెప్పారు. షాద్‌నగర్‌లో నివాసముంటున్న ఉరుసు నర్సింహ, ఈశ్వర్, ఉరుసు రాజుల నుంచి 490 జిలెటిన్‌స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నామని.. వీటి విలువ రూ.8,74,950 ఉంటుందని వివరించారు. శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు, షాద్‌నగర్ పోలీసుల భాగస్వామ్యంతో దాడులు నిర్వహించి పేలుడు పదార్థాలను గుర్తించి నట్లు వెల్లడించారు. ఈ కేసులో నర్సింహ, ఈశ్వర్, రాజులను అరెస్ట్ చేశామని, మధుసూదన్‌రెడ్డి, సతీశ్, నరేందర్‌రెడ్డి పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. జిలెటిన్ స్టిక్స్‌తోపాటు కంప్రెషర్ ట్రాక్టర్, నాలుగు స్మార్ట్ ఫోన్‌లను సీజ్ చేసినట్లు వివరించారు. పేలుడు పదార్థాలను గుర్తించి నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపించిన పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా ఏసీపీ అభినందించారు.

మండల పరిషత్ ప్రాంగణంలో అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

తెలంగాణ అమరవీరులకు నివాళులు

ఆమనగల్లు, జూన్ 1 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న దశాబ్ది వేడుకల్లో భాగంగా నేడు ఆమనగల్లు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సాధనలో ప్రాణ త్యాగాలు చేసిన తెలంగాణ అమర వీరులకు మండల పరిషత్ ప్రాంగణంలో ఉన్న అమరుల విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ఆమర వీరులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్ ఉన్నారు.

విత్తనాల కొనుగోలుపై అవగాహన

- ఫెర్టిలైజర్ దుకాణాల తనిఖీ
- రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలి
- షాపుల్లో ధరల పట్టిక, ఎరువుల నిల్వలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలి
- జిల్లాలోని వివిధ మండలాల వ్యవసాయాధికారులు
- గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచన

చేవెళ్లరూరల్ : తంగడిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ విస్తరణ అధికారి రాజేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల రూరల్, జూన్ 1 : చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల, తంగడిపల్లి గ్రామాల్లో నకిలీ విత్తనాలు, విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, రైతులు విత్తనాల కొనుగోలులో మోసపోవద్దని, జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కడ్తాల్ : నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని విత్తనాలు, ఎరువుల నిల్వలతోపాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు విక్రయించినప్పుడు తప్పనిసరిగా రశీదులు అందజేయాలని సూచించారు. ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలని, నకిలీ విత్తనాలను అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వానకాలంలో పంటల సాగుకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. షాపుల్లో ధరల పట్టిక, ఎరువుల నిల్వలను సూచించే బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఈవో వందన, సిబ్బంది పాల్గొన్నారు.

కడ్తాల్ : రావిచేడ్‌లోని ఫెర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో శ్రీలత

బిల్లు తీసుకోవాలి

మొయినాబాద్ : రైతులు విత్తనాలు కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాగమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాలు, పురుగుల మందు దుకాణాలను ఆర్ఐ చంద్రమోహన్‌తో కలిసి తనిఖీ చేశారు. దుకాణాల్లోని విత్తనాల ప్యాకెట్లు, మందు డబ్బాలు, రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు అమ్మిన డీలర్లు తప్పనిసరిగా రైతులకు బిల్లులు ఇవ్వాలని పేర్కొన్నారు. బిల్లులు, విత్తనాల ప్యాకెట్లను పంట చేతికి వచ్చే వరకు భద్రపరచాలని రైతులకు సూచించారు. లూజుగా ఉన్న విత్తనాలు కొనుగోలు చేయరాదన్నారు. డీలర్ షాపుల్లో లైసెన్స్ పేరుతో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని ఆమె రైతులకు సూచించారు.

మొయినాబాద్ : ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ, రెవెన్యూ అధికారులు

ఆమనగల్లు : ఫెర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి, డీటీ వినోద్

రికార్డులు, విత్తనాలు, మందుల నిల్వల పరిశీలన

ఆమనగల్లు : అధీకృత ఫెర్టిలైజర్ డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దుతో పాటు కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని పలు అధీకృత డీలర్ దుకాణాలను మల్టీ డిసిప్లినరీ టీం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

షాబాద్‌లో ఫెర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి వెంకటేశం, డీటీ మధు, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి

ఈ సందర్భంగా వారు రికార్డులు, విత్తనాలు, మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. దుకాణాల ఎదుట స్టాక్ వివరాలు, ధరల పట్టికను ఏర్పాటు చేయాలని అమె సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని షాప్ నిర్వాహకులకు ఏవో సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వినోద్, హెడ్ కానిస్టేబుల్ శివ కుమార్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

షాబాద్ : అధిక ధరలకు విత్తనాలు అమ్మితే డీలర్లపై చర్యలు తప్పవని షాబాద్ మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం అన్నారు. శనివారం షాబాద్‌లోని వివిధ ఫెర్టిలైజర్ దుకాణాలను డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. అనంతరం దుకాణాల్లో ఎరువులు, విత్తనాల స్టాకు నిల్వలు, స్టాకు రిజిస్టర్‌లు, బిల్లు బుక్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు విత్తనాల కొరత రాకుండా తగినన్ని నిల్వలు పెట్టాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో డీలర్లు రాజేందర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, భీమ్‌సేనారెడ్డి ఉన్నారు.

బలోపేతం దిశగా ప్రభుత్వ పాఠశాలలు

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సెక్టార్ ఆఫీసర్ జావేద్

మొయినాబాద్, జూన్ 1 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతం దిశగా బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సెక్టార్ ఆఫీసర్ జావేద్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో విద్యా, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని అమ్మ ఆదర్శ పాఠశాలలు, బడిబాట, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, విద్యార్థుల యూనిఫామ్‌లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుందామన్నారు. బడి బాట కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని చెప్పారు. విద్యార్థులకు యూనిఫామ్‌లను జూన్ 12 వరకు అందేలా చర్యలు తీసుకుందామన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా అందరినీ భాగస్వాములను చేద్దామని ఆయన సూచించారు.

మొయినాబాద్ : సమన్వయ సమావేశంలో వివిధ అంశాలపై చర్చిస్తున్న అధికారులు

కార్యక్రమంలో ఎంపీడీవో సంధ్య, ఎంఈవో వెంకటయ్య, డీటీ వినోద్‌కుమార్, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఎం రవీందర్, ఎస్ఐ నర్సింహరాజు ఉన్నారు.

పనులు వేగవంతం చేయాలి

షాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య అన్నారు. శనివారం మండల పరిషత్తు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 18 గ్రామాలకు సంబంధించిన ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్, విద్యుత్, తాగునీటి సదుపాయాల కోసం నిధులు మంజూరయ్యాయన్నారు. పనులు వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మాన్‌సూన్ ప్లాన్‌కు సంబంధించి గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి ఆ ఇంటి వాళ్లకు ప్రత్యేక వసతులు కల్పించాలని, కిందిస్థాయిలో ఉన్న ఇండ్లను గమనించి అక్కడ మొరం పోయించి లెవల్ చేయించాలని సూచించారు. బడిబాట ప్రోగ్రాంకు సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 3 నుంచి 11 వరకు కచ్చితంగా అన్ని గ్రామాల్లో ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ప్లాన్ చేసుకుని గ్రామ సభలు నిర్వహించాలని కోరారు. గ్రీన్ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి ప్రణాళిక వేసుకుని నర్సరీల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. టైప్-1 నుంచి టైప్-2కు డంపింగ్ యార్డు కన్వర్ట్ చేయాల్సిన గ్రామాలకు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో కంపోస్ట్ తయారీ చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

షాబాద్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకయ్య

ఘనంగా హనుమాన్ జయంతి

- స్వామివారికి అభిషేకాలు, సింధూర ధారణ, అర్చనలు, హారతి, హోమాలు, బైక్ ర్యాలీలు, పల్లకి సేవ, అన్నదాన కార్యక్రమాలు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

కడ్తాల్ : ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, నాయకులు

కడ్తాల్, జూన్ 1 : మండల కేంద్రంతోపాటు పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం స్వామివారికి అభిషేకాలు, సింధూరధారణ, అర్చనలు, హారతి, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

ఆమనగల్లు : అంతిరింతిరి కొండ ప్రసాన్నంజనేయ ఆలయంలో హోమం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్‌టౌన్ : పల్లకి సేవలో భక్తులు

ఆమనగల్లు : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని అంతిరింతిరి కొండ ప్రసాన్నంజనేయ ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ఉదయం నుంచి భక్తి శ్రద్ధలతో అభిషేకం, యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు.

షాద్‌నగర్‌టౌన్ : భక్తులు ఉదయం నుంచి ఆలయల వద్ద ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తమలపాకులతో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని చౌడమ్మగుట్ట వీరాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్ అంటూ భజన చేస్తూ స్వామివారి పల్లకి సేవా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు యాదయ్య 25 కిలోల బియ్యం, ఆనంద్, క్యూసెట్ శ్రీనివాస్ స్టీల్ సామగ్రిని అందజేశారు. వారికి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

యాచారం : మండలంలోని నందివనపర్తి గ్రామంలో భక్తాంజనేయ స్వామి సహిత జ్ఞాన సరస్వతి ఆలయం ఆధ్వర్యంలో సంకల్ప భవనంపై ధ్వజారోహణ చేపట్టారు. హనుమాన్ విగ్రహానికి అభిషేకం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొమ్మోనిబావి, గంటోనిబావి, వెంకోనిబావి, కరిద్దోనిబావి, బొల్లిగుట్టతండా, నీలిపోచమ్మతండా, ఏనెకింధితండా, పిల్లిపల్లి గ్రామాల్లో యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో నందివనపర్తి పరిసరాలు దద్దరిల్లాయి. అనంతరం ఆయా గ్రామాల్లో ఉన్న హనుమాన్ ఆలయాల్లో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసాను పఠించారు. అనంతరం జ్ఞాన సరస్వతి ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించారు.

కొత్తూరు : హనుమాన్ జయంతిలో పాల్గొన్న దేవేందర్‌యాదవ్, సుదర్శన్‌గౌడ్ తదితరులు

కొత్తూరు : కొత్తూరు మున్సిపాలిటీలో హనుమాన్ జయంతిని ఆదివారం బజరంగ్‌దళ్ సంయోజక్ ఎర్రవెల్లి శివకుమార్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్‌యాదవ్ మారుతి హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. మున్సిపాలిటీకి చెందిన అనిల్‌చారి స్వామివారికి బంగారు కన్ను సమర్పించారు.



ఆమనగల్లు : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని అంతిరింతిరి కొండ ప్రసాన్నంజనేయ ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీ

యాచారం : బైక్ ర్యాలీ చేస్తున్న యువకులు

తెలంగాణ ఆవతరణ దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం, జూన్ 1 : తెలంగాణ ఆవరతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించనున్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు పోలీసుస్టేషన్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ఇబ్రహీంపట్నం పెద్దచెరువు కట్ట పైగల అమరవీరుల స్థూపాన్ని పూలతో అలంకరించారు. బీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేయనున్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిండటంతో పాటు పలు రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

యువతి అదృశ్యం

పెద్దఅంబర్‌పేట, జూన్ 1 : ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ప్రాంజలి అనే యువతి కుటుంబసభ్యులతో కలిసి మండల పరిధిలోని గండిచెర్వు సమీపంలోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో కూలీ పని చేస్తూ అక్కడే నివసిస్తున్నది. ఇటీవల ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ప్రాంజలి తిరిగి ఇంటికి రాలేదు. సమీప బంధువులు, తెలిసినవారి ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.